

గంజాయి పట్టివేత

చింతూరు నుంచి భద్రాచలం మీదుగా ట్రాక్టర్‌లో తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. 8లో



కృష్ణమ్మ చెంతకు గోదావరి

సీతారామ ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జలాలను సాగర్ ఆయకట్టుకు తరలించేందుకు అంతా సిద్ధమైంది. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉండటంతోపాటు అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

అడవులను సంరక్షిస్తేనే మనుగడ

- సీసీఎఫ్ భీమా నాయక్



ప్లాంటేషన్‌లో మొక్కలను పరిశీలిస్తున్న భీమా నాయక్ తదితరులు

అశ్వారావుపేటరూరల్: అడవులను సంరక్షిస్తేనే మానవ మనుగడ సాధ్యమని సీసీఎఫ్ భీమా నాయక్ అన్నారు. శనివారం అశ్వారావుపేట రేంజ్ పరిధిలోని అశ్వారావుపేట బీట్, పాపిడిగూడెం, ఊట్లపల్లి, లంకాలపల్లితోపాటు అటవీ శాఖ అధ్వర్యంలో చేపట్టిన ప్లాంటేషన్లను ట్రైనీ ఐఎఫ్ఎస్ రేవంత్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఆయా ప్లాంటేషన్లలో మొక్కలు ఏపుగా పెరగడాన్ని గమనించి సిబ్బందిని అభినందించారు. అడవుల పరిరక్షణకు అటవీ సిబ్బందితోపాటు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ ఎఫ్‌డీవో దామోదర్ రెడ్డి, రేంజర్ మురళి, ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీనం..



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఇల్లెందు/సింగరేణి(కొత్తగూడెం): కార్మికోద్యమాన్ని బలోపేతమే చేయడమే లక్ష్యంగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ అనుబంధ ఐఎఫ్‌టీయూని టీయూసీఐలో విలీనం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. న్యూఢిల్లీలో శనివారం రెండు సంఘాల నడుమ చర్చలు జరిగాయని ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు ఎస్.కే.యాకూబ్‌షావలీ ఓ ప్రకటనలో తెలిపారు. త్వరలోనే రాష్ట్రంలో సభ ఏర్పాటుచేసి ఈ నిర్ణయాన్ని ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన చర్చల్లో టీయూసీఐ జాతీయ అధ్యక్షుడు అమ్రిష్ పటేల్, నాయకులు అలీక్ చక్రవర్తి, ఉమాకాంత్, అరవింద్ నాయర్, ఇఫ్టూ తెలంగాణ అధ్యక్ష, కార్యదర్శులు వనమాల కృష్ణ, కె.సూర్యం, నేతలు నరేందర్, ఎస్.ఎల్.పద్మ, ఎం.హన్మేష్, కె.రాజన్న, వెంకటేశ్ పాల్గొన్నారని యాకూబ్‌షావలీ తెలిపారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే గర్భగుడిలో స్వామి మూల విరాట్‌తో పాటు ఆలయంలో శ్రీవారి పాదానికి పంచామృతాలతో అభిషేకం జరిపించారు. అతర్వాత స్వామి, అమ్మవార్లను అలంకరించి నిత్యకల్యాణం చేశారు. అనంతరం తెలంగాణ, ఏపీ నుంచి వేలాదిగా హాజరైన భక్తుల సమక్షాన పల్లకీ సేవ నిర్వహించగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ జగన్మోహన్ రావు, చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

సీతారామ సిద్ధం

గోదావరి జలాలతో పొలాలు తడవనున్నాయి. తొలిసారిగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పంట క్షేత్రాల్లోకి పరుగులు పెట్టనున్నాయి. ఎనిమిదేళ్లుగా ఆగుతూ.. సాగుతున్న సీతారామ ఎత్తిపోతల పథకం కీలకదశకు చేరుకుంది. ఆదివారం 2, 3 పంప్‌హౌస్‌ల్లో ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వ యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. –ములకలపల్లి



పూసుగూడెం శివారులోని వీకే రామవరం పంప్‌హౌస్



వీకే రామవరంలో ఉన్న సీతారామ పంప్‌హౌస్-2లోని మోటార్లు

పంప్‌హౌస్-2, 3 నుంచి నేడు ఎత్తిపోతలు

- 63 మీటర్ల నుంచి 160 మీటర్లకు గోదావరి జలాలు
- ట్రయల్ రన్ ప్రారంభించనున్న ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్
- హాజరుకానున్న మంత్రులు తుమ్మల, పొంగులేటి

స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సీతారామ ఎత్తి పోతల పథకం ద్వారా గోదావరి జలాలను సాగుభూములకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ములకలపల్లి మండలంలో ఉన్న పంప్‌హౌస్-2(పూసుగూడెం శివారు వీకే రామవరం), పంప్‌హౌస్-3(కమలాపురం)లలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ట్రయల్ రన్ చేపట్టనున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే బీజీ కొత్తూరులోని మొదటి పంప్‌హౌస్ ట్రయల్ రన్ విజయవంతమైంది.

63 మీటర్ల నుంచి 130 మీటర్ల ఎత్తుకు...

దుమ్ముగూడెం ఆనకట్ట దగ్గర గోదావరి నదీ ప్రవాహం సముద్ర మట్టానికి 63 మీటర్ల ఎత్తులో ఉండగా, నీటిని గ్రావిటీ కెనాల్ ద్వారా 9.70 కి.మీ దూరంలో, 43 అడుగుల ఎత్తులో ఉన్న మొదటి పంప్‌హౌస్(అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు)కు చేరుతాయి. ఇక్కడ నీటిని 25 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మోటార్ల ద్వారా 67.15 మీటర్లకు ఎత్తిపోస్తారు. అక్కడి నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా 34 కి.మీ దూరంలో 62.20 మీటర్ల ఎత్తులో ములకలపల్లి మండలం పూసుగూడెం దగ్గరున్న పంప్‌హౌస్-2కు చేరుకుంటుంది. అక్కడ 40 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మోటార్లతో 110 మీటర్లకు ఎత్తిపోస్తారు. ఆ తర్వాత గోదావరి జలాలు గ్రావిటీ కెనాల్ ద్వారా 13.35 కి.మీ ప్రయాణించి 107 మీటర్ల ఎత్తులో కమలాపురంలో ఉన్న పంప్‌హౌస్-3కి చేరుకుంటాయి.

రెండు నెలలుగా ప్రత్యేక దృష్టి

ఈ ఖరీఫ్ సీజన్‌లోనే ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందివ్వాలనే సంకల్పంతో జిల్లాకు చెందిన, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి శ్రమిస్తున్నారు. ఈ ఏడాది ఆరంభంలో రాజీవ్ లింక్ కెనాల్ పనులకు శంకు స్థాపన చేశారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత జూన్ 15న దుమ్ముగూడెం ఆనకట్టతో పాటు పంప్‌హౌస్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గడిచిన రెండు నెలలుగా మూడు పంప్‌హౌస్‌లలో మోటార్లను ఎత్తిపోతలకు సిద్ధం చేసేలా చర్యలు తీసుకున్నారు. సంబంధిత శాఖల అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు.

రాజీవ్ కెనాల్ ద్వారా ఎన్నెస్పీ కాలువ మీదుగా వైరా రిజర్వాయర్‌కు..

కమలాపురం పంప్‌హౌస్-3 నుంచి 40 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మోటార్ల సాయంతో గోదావరి నీటిని 160 మీటర్లకు ఎత్తిపోస్తారు. అక్కడి నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా జూలూరుపాడు మండలంలో 130 మీటర్ల ఎత్తులో ఉన్న రాజీవ్ కెనాల్‌కు నీరు చేరుకుంటుంది. కెనాల్ ద్వారా నాగార్జున సాగర్(ఎన్నెస్పీ)కాలువలో కలిసి వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలు చేరుతాయి. మొత్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో లక్షన్నర ఎకరాలకు సాగునీరు అందనుంది. ఇప్పటికే బీజీ కొత్తూరు పంప్‌హౌస్‌లో నీటిని ఎత్తిపోయగా అవి పంప్‌హౌజ్-2కు చేరుకున్నాయి. నేడు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేతుల మీదుగా పంప్‌హౌస్-2, పంప్‌హౌస్-3లలో నీటిని ఎత్తిపోస్తారు. ట్రయల్‌రన్‌లో ఇబ్బందులు ఎదురైతే ఈ నెల 15వ తేదీలోగా వాటిని సరిదిద్దుతారు.

ఏదీ భరోసా?

- పారిశుద్ధ్య కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించని వైనం
- వీధులన్నీ శుభ్రం చేస్తున్నా కనికరంలేని మున్సిపల్ అధికారులు
- ప్రమాదవశాత్తు మృతి చెందిన ఓదమ్మ కుటుంబానికి అందని పరిహారం
- సింగరేణి తరహాలో బీమా సౌకర్యం కల్పించాలని కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్



ఓదమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని ఆస్పత్రి ఆవరణలో డిమాండ్ చేస్తున్న వివిధ పార్టీల నాయకులు

కొత్తగూడెంఅర్బన్: చెత్తాచెదారం తొలగించి పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలకపాత్ర పోషించే పారిశుద్ధ్య కార్మికులకు భరోసా లేకుండా పోయింది. అందరి ఆరోగ్యాన్ని కాపుడుతున్నవారు ప్రమాదవశాత్తు మృతి చెందితే బీమా పరిహారం పొందలేని పరిస్థితి నెలకొంది. మున్సిపాలిటీల్లో ఏళ్ల తరబడి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు అధికారులు ఇన్సూరెన్స్ చెల్లించడం లేదు. దీంతో ప్రమాదవశాత్తు చనిపోయినా పరిహారం అందడంలేదు. కనీసం కార్మిక శాఖలో జనరల్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించినా రూ.1.30 లక్షల వరకు ఇన్సూరెన్స్, అంత్యక్రియలకు రూ.10 వేల ఆర్థికసాయం అందేవి. బ్యాంకుల్లో ఇన్సూరెన్స్ చెల్లించినా ప్రమాదబీమా వర్తించి ఉండేది. కానీ ఇవేవీ చెల్లించకపోవడంతో కొత్తగూడెం మున్సిపాలిటీలో మృతి చెందిన పారిశుద్ధ్య కార్మికురాలికి పైసా పరిహారం అందేపరిస్థితి లేదు.

రూ. 3 లక్షల చెల్లింపులతోనే సరి

కొత్తగూడెం త్రీఇంక్లైన్‌కు చెందిన ఓదమ్మ పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తోంది. శుక్రవారం విధులు నిర్వహించిన అనంతరం పని ప్రదేశంలో ఉన్న ట్రాలీలో మంచినీళ్ల డబ్బా అనుకుని దోమల మందు తాగిన ఆమె అస్వస్థతకు గురైంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందింది. వివిధ పార్టీలు, సంఘాల నాయకులు డిమాండ్ చేస్తే మున్సిపల్ శాఖ నుంచి మృతురాలి కుటుంబానికి రూ. 3 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించారు. అది కూడా మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం తర్వాత నగదు ఇవ్వనున్నారు. ప్రస్తుతం అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు అందించారు. అయితే మున్సిపాలిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు అధికారులు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తే ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబాలకు ఆసరాగా ఉండే అవకాశం ఉంటుంది.

సింగరేణిలో ఇలా...

సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులు ప్రమాదవశాత్తు కార్మికులు చనిపోతే భారీగా పరిహారం అందేలా అధికారులు చర్యలు చేపట్టారు. రూ.20 లక్షల ప్రమాద బీమా వర్తించే విధంగా, మృతుల డెబిట్ కార్డును వినియోగించి విత్ డ్రా ఆ నెలలో చేసి ఉంటే వారికి అదనంగా మరో రూ.10 లక్షలు ఇన్సూరెన్స్, కాంట్రాక్టు కార్మికుడు అదనంగా సంవత్సరానికి రూ.200 బ్యాంకు వారికి చెల్లిస్తే మరో రూ.7 లక్షలు ప్రమాదబీమా, సంవత్సరానికి ఎవరైన కాంట్రాక్టు కార్మికుడు రూ.1000 చెల్లిస్తే అదనంగా రూ.15 లక్షల బీమా వర్తించేలా నిబంధనలు అమలు చేస్తున్నారు.

కొత్తగూడెం మున్సిపాలిటీలో 202 మంది కార్మికులు..

కొత్తగూడెం మున్సిపాలిటీలో పారిశుద్ధ్య విభాగంలో ఔట్‌సోర్సింగ్ కార్మికులు 176 మంది, రెగ్యులర్ కార్మికులు 26 మంది... మొత్తం 202 మంది పని చేస్తున్నారు. వీరిలో ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఎటువంటి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించలేదు. గతంలో కార్మిక శాఖ నుంచి ఇన్సూరెన్స్ కట్టించినా, రెన్యూవల్ చేయలేదు. వీరితోపాటు జిల్లాలోని మరో మూడు మున్సిపాలిటీల్లో కూడా కాంట్రాక్ట్ కార్మికులు పారిశుద్ధ్య, ఎలక్ట్రికల్, వాటర్ సప్లై తదితర విభాగాల్లో పనిచేస్తున్నారు. వీరిందరికీ సింగరేణి తరహాలోనే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కార్మికులు కోరుతున్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన కలెక్టర్

హైకోర్టు జడ్జి భీమపాక నగేష్‌ను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో బసచేసిన న్యాయమూర్తిని కలెక్టర్ కలిసి మొక్కను అందించారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు. –బూర్గంపాడు



పూర్తి కాకుండానే ప్రారంభోత్సవమా?

ములకలపల్లి/జూలూరుపాడు: సీతారామ ప్రాజెక్టు పనులు పూర్తి కాకుండానే ఎలా ప్రారంభిస్తారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాని ఐలయ్య ప్రశ్నించారు. ములకలపల్లి మండలం పూసుగూడెం శివారులో పంప్‌హౌస్-2, కాల్వలతో పాటు జూలూరుపాడు మండలంలోని వినోభానగర్ వద్ద సీతారామ కెనాల్ పనులను నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ కింద భాగంలో సీతారామ ప్రాజెక్ట్ నిర్మిస్తున్నా లాక్‌లు ఏర్పాటు చేయకుండా కేవలం వర్షపు నీటి ఆధారంగా ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధపడిందన్నారు. ఈ నెల 15న రెండో పంప్‌హౌస్‌ను సీఎం ప్రారంభిస్తారని ప్రకటించినప్పటికీ అక్కడ గోదావరి జలాలు కాకుండా వర్షపు నీటిని నిల్వ చేయడం ప్రజలను మోసం చేయడమేనని చెప్పారు. జిల్లాలోని ఎనిమిది మండలాల మీదుగా ప్రవహిస్తున్న ప్రాజెక్ట్ కాల్వ ద్వారా ఈ ప్రాంత సాగు భూములకు నీరు అందించకపోవడం సరికాదని, జిల్లా ఆయకట్టుకు నీరు ఇవ్వకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తే ఆందోళనలు చేపడతామని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యలమంచి వంశీకృష్ణ, అన్నవరపు సత్యనారాయణ, నాయకులు కొండబోయిన వెంకటేశ్వర్లు, గార్లపాటి వెంకటి, వల్లమల చందర్‌రావు, బానోత్ మధు, గడిదేశి కనకరత్నం, బానోత్ ఇస్రా, బిచ్చు, శంకర్, పవన్, అభిమిత్ర, భాస్కర్, ముదిగొండ రాంబాబు, ఆదినారాయణ, రామ్మూర్తి, భాస్కర్ పాల్గొన్నారు.



కాల్వను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ఐక్యతకు నాందిపలికేలా..

భద్రాచలంటౌన్: ఉమ్మడి జిల్లాలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పండుగ వాతావరణంలో ఆదివాసీల ఐక్యతకు నాందిపలికేలా నిర్వహించుకోవడం అభినందనీయమని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీడీఏ అధికారులు, సిబ్బంది, గిరిజన సంఘాల నాయకులకు అభినందనలు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్‌వసంత్

కొత్తగూడెంటౌన్: క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ సూచించారు. శనివారం కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహించారు. పట్టణ పరిధిలోని రామవరం సాధన గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ పోటీలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ ప్రారంభించారు. కొద్దిసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ వృత్తిలో ఎదుర్కొంటున్న ఒత్తిడి నుంచి క్రీడా పోటీలు ఉపశమనం కలిగిస్తాయన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులను మూడు జట్లుగా ఏర్పడి ఆడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి గొల్లపూడి భానుమతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు, రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ, మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి.శివ నాయక్, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, తోట మల్లేశ్వరరావు, ఎంఎస్ఆర్ రవిచంద్ర, సాధిక్ పాషా, దూదిపాల రవికుమార్, ఎస్.ప్రవీణ్‌కుమార్, ప్రతిభ, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

పీజీ ప్రవేశ పరీక్షలో ప్రతిభ

అశ్వారావుపేటరూరల్: పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్షలో ఓ విద్యార్థిని ఉత్తమ ప్రతిభ కనబరిచింది. దమ్మపేట మండలం మందలపల్లి గ్రామానికి చెందిన జుంజునూరి ప్రవళిక అశ్వారావుపేటలోని ఓ కళాశాలలో ఇంటర్, బీజెడ్‌సీ విద్యనభ్యసించింది. పీజీ కామన్ ఎంట్రన్స్(కెమిస్ట్రీ) పరీక్షలో రాష్ట్రస్థాయిలో 20వ ర్యాంక్ సాధించి సత్తాచా టింది. ఈ సందర్భంగా విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్ శేషుబాబు, అధ్యాపకులు అభినందించారు.



పీజీ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపిన ప్రవళిక

రాముడి చెంతకు రైలుమార్గం..

- భద్రాచలంతో దేశవ్యాప్త కనెక్టివిటీ
- 'మల్కన్‌గిరి-భద్రాచలం' రైల్వేలైన్ ప్రకటనతో హర్షాతిరేకాలు
- తొలిదశలోనే పాండురంగాపురం నుంచి పనులు చేపట్టాలని విన్నపం



భద్రాచలం వ్యూ (ఇన్‌సెట్) పాండురంగాపురం రైల్వే స్టేషన్

భద్రాచలం: భద్రాచలం పరిసర ప్రాంత ప్రజల ఎన్నో ఏళ్ల కలకు తొలి అడుగు పడింది. దేశవ్యాప్తంగా భక్తుల రాకపోకలకు, వాణిజ్య, వ్యాపార రంగాల అభివృద్ధికి కీలకమైన భద్రాచలం రైల్వే లైన్‌కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మల్కన్‌గిరి నుంచి భద్రాచలం మీదుగా గోదావరికి అవతలి ఒడ్డున ఉన్న పాండురంగాపురం(బూర్గంపాడు మండలం) వరకు 173 కిలోమీటర్ల రైల్వే లైన్ నిర్మాణానికి ఓకే చెప్పింది. దీంతో భక్తులు, ఇరు రాష్ట్రాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నో ఏళ్లుగా పోరాటం

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి నేరుగా రైలు మార్గం ఉండాలని దశాబ్దాలుగా భక్తులు కోరుతున్నారు. ప్రస్తుతం కొత్తగూడెం వరకు రైలు మార్గంలో వచ్చి, అక్కడ నుంచి 45 కిలోమీటర్లు రోడ్డు మార్గం ద్వారా భద్రాచలం చేరుకుంటున్నారు. భద్రాచలం, సారపాకల నడుమ గోదావరి నదీ ప్రవాహం ఉండటంతో మణుగూరు మార్గంలో పాండురంగాపురం వద్దనున్న రైల్వే లైన్‌ను సారపాక వరకు పొడిగించాలని ఎన్నో ఏళ్లుగా పోరాటాలు సాగుతున్నాయి. ఈ క్రమంలో 15.5 కిలోమీటర్ల లైన్ పొడిగింపునకు బడ్జెట్‌లో రూ.47.5 కోట్లు కేటాయించినా నిధులు మాత్రం విడుదల చేయలేదు. దీంతో సారపాక రైల్వేలైన్ కాగితాలకే పరిమితమైంది. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనూహ్యంగా ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి నుంచి పాండురంగాపురం వరకు నూతన రైల్వే లైన్ నిర్మాణానికి ఆమోదం తెలపడంతో స్థానికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

తొలి దశలోనే పాండురంగాపురం లైన్ పూర్తయితే..

మల్కన్‌గిరి-భద్రాచలం రైల్వే లైన్‌కు సుమారు రూ.3,592 కోట్లు ఖర్చు అవుతుందని ఫైనల్ లోకేషన్ సర్వేలో తేలినట్లు తెలుస్తోంది. ఒడిశా నుంచి భద్రాచలం వరకు అత్యధికంగా ఈ రైల్వే లైన్ అటవీభూమిలో నుంచే వచ్చే అవకాశం ఉంది. ఇందుకోసం అటవీ శాఖ, పర్యావరణ ఇతర అనుమతులు కావాల్సి ఉంటుంది. రైల్వే లైన్ నిర్మాణం పలు విడతలుగా సాగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తొలి దశలోనే పాండురంగాపురం నుంచి భద్రాచలం వరకు రైల్వే లైన్ పూర్తిచేయాలని స్థానికులు, భక్తులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో పాండురంగాపురం నుంచి సారపాక వరకు 15.5 కిలోమీటర్ల ప్రతిపాదన ఉండగా మరో 4 లేదా 5 కిలోమీటర్లను గోదావరి నది మీదుగా బ్రిడ్జి నిర్మాణం ద్వారా అనుసంధానం చేస్తే భద్రాచలానికి రైల్వేలైన్ వస్తుంది. రైల్వేలైన్ పూర్తికి కేంద్ర ప్రభుత్వం ఆరేళ్ల గడువు నిర్దేశించగా మొట్టమొదటే పాండురంగాపురం నుంచి పనులు చేపడితే భద్రాచలానికి భక్తులు రైల్వే మార్గం ద్వారా చేరుకునే అవకాశం వస్తుంది. భక్తుల రాక పెరిగి భద్రాచలం ఆధ్యాత్మిక, పర్యాటక కారిడార్‌గా మారే అవకాశం ఉంది. వ్యాపార, వాణిజ్య, పరిశ్రమల అభివృద్ధితోపాటు స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

పూర్తయితే భద్రాచలానికి మహర్దశ



భద్రాచలానికి కేంద్ర ప్రభుత్వం నూతన రైల్వేలైన్‌ను ప్రకటించి ఆమోదించటం హర్షణీయం. ఇదే పూర్తయితే భద్రాచలానికి మహర్దశ పడుతుంది. దేశంలోని అనేక రాష్ట్రాలకు రవాణా సులువుగా మారుతుంది.

–బూసిరెడ్డి శంకర్‌రెడ్డి, భద్రాద్రి ప్రాంత పరిరక్షణ సమితి చైర్మన్

తొలిదశలోనే చేపట్టాలి



ఎన్నో ఏళ్లుగా భద్రాచలం రైల్వే లైన్ కోసం పోరాడుతున్నాం. కేంద్ర ప్రభుత్వం నూతన రైల్వే లైన్ ప్రకటించటం సంతోషించదగ్గ విషయమే. తొలి విడతలోనే పాండురంగాపురం నుంచి భద్రాచలం వరకు రైలు మార్గాన్ని చేపట్టాలి.

–కొదమ సింహం పాండురంగాచార్యులు, రైల్వే సాధన సమితి కన్వీనర్

కృష్ణమ్మ చెంతకు గోదావరి!

- 'సీతారామ'తో సాగర్ ఆయకట్టు స్థిరీకరణ
- కీలకంగా ఏన్కూరు లింక్ కెనాల్
- పరిహారం రాకముందే భూములిచ్చిన రైతులు
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి నిరంతర పర్యవేక్షణ
- నేడు మంత్రుల నేతృత్వాన ములకలపల్లి మండలంలో ట్రయల్‌రన్





ఖమ్మం జిల్లా ఏన్కూరు వద్ద శరవేగంగా కొనసాగుతున్న రాజీవ్ సాగర్ లింక్ కెనాల్ పనులు

వైరా : ఉమ్మడి జిల్లాలో దాదాపు 6.50 లక్షల ఎకరాలకు నీరందించే సీతారామ ప్రాజెక్టు పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కతోపాటు రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తరచుగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ఎక్కడైనా సమస్య ఏర్పడితే పరిష్కరిస్తుండడంతో పనుల్లో వేగం పెరిగింది. ఈనెల 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాద్రి జిల్లాలోని పంపుహౌస్‌ల్లో మోటార్లను స్విచాన్ చేయనుండగా.. నాగార్జునసాగర్ ఆయకట్టుకు అవసరమైన సమయాన గోదావరి జలాలు అందుబాటులో వస్తాయి. పంపుహౌస్‌ల్లో మోటార్ల ట్రయల్ రన్‌ను ఆదివారం మంత్రులు తుమ్మల, పొంగులేటితో కలిసి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

సాగునీటి కష్టాలు లేకుండా..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి చేపట్టిన జలయజ్ఞంలో భాగంగా ఉమ్మడి జిల్లా సాగునీటి అవసరాలు తీర్చేందుకు రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. తెలంగాణ ఏర్పడ్డాక ఈ రెండింటి స్థానంలో భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో 6.50 లక్షల ఎకరాలకు సాగునీరు, 320 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా బహుళార్థ సాధకంగా సీతారామ ప్రాజెక్టును తెరపైకి తీసుకొచ్చారు. ఎనిమిదేళ్లుగా ఈ పనులు కొనసాగుతుండగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రత్యేక దృష్టి సారించింది.

ముగ్గురు మంత్రుల పర్యవేక్షణ

లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సీతారామ ప్రాజెక్టుపై సమీక్షించగా.. జూన్ 13న నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల వివరాలు, నిధులపై అధికారులు వెల్లడించిన వివరాల మేరకు బడ్జెట్‌లో సీతారామ ప్రాజెక్టుకు రూ.799 కోట్లు కేటాయించారు. అందులో పంపుహౌస్‌లు, డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లకు రూ.687 కోట్లు, సీతమ్మసాగర్ బ్యారేజీ, అనుబంధ పనులకు రూ.111 కోట్లు వెచ్చించనున్నారు. ఆపై పంపుహౌస్, టన్నెల్ పనుల పురోగతిని డిప్యూటీ సీఎం సహా మంత్రులు తరచూ పరిశీలిస్తున్నారు.

ఈ సీజన్‌లోనే నీరు ఇచ్చేలా..

ఈ వానాకాలం సీజన్‌లో సీతారామ ద్వారా కనీసం 1.50 లక్షల ఎకరాల సాగర్ ఆయకట్టుకు నీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఏన్కూరు వద్ద రాజీవ్ కెనాల్ పూర్తయితే సాగర్ జలాలు అందుబాటులో రాని సమయాన ఈ నీరు వాడుకునే వీలుంటుంది. గోదావరి నదిపై ఆనకట్ట నుంచి రాజీవ్‌కెనాల్ వరకు నీటిని తీసుకెళ్లాలంటే మూడు చోట్ల ఎత్తిపోయాల్సి ఉంటుంది. దీంతో అశ్వాపురం మండలంలోని బీజీ కొత్తూరులో 25 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఆరు, ములకలపల్లి మండలం వీకే రామవరంలో 40 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఆరు, కమలాపురం పంప్‌హౌస్‌లో 40 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదు మోటార్లే కాక 25 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు మోటార్లున్నాయి. తొలి దశలో ఒక మోటార్ నడిపించడం ద్వారా ఎన్నెస్పీ, వైరా, లంకాసాగర్ రిజర్వాయర్లకు నీరు సరఫరా చేస్తారు. ఇక యాతాలకుంట టన్నెల్ పనులు శరవేగంగా సాగుతుండడంతో సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలకు సాగునీరు అందుతుంది. ఆపై జూలూరుపాడు, పాలేరు టన్నెళ్ల నిర్మాణం పూర్తయితే అన్ని మోటార్లు పూర్తి స్థాయిలో నడిపించి పాలేరు, ఖమ్మం,మధిర, పినపాక, అశ్వారావుపేట, కొత్తగూడెం నియోజకవర్గాల్లో పంటలకు నీరు అందిస్తారు. అలాగే ఇల్లెందుకు కూడా ఎత్తిపోతల పథకాల ద్వారా నీరు అందించాలనే డిమాండ్ ఉంది. కాగా, ఆదివారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ములకలపల్లి మండలం పూసుగూడెం, కమలాపురం వద్ద పంపుహౌస్‌ల్లోని మోటార్ల ట్రయల్‌రన్‌ను ప్రారంభించనున్నారు.

ఏన్కూరు లింక్ కెనాలే ప్రధానం

సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను సాగర్ ఆయకట్టుకు అందించాలంటే ఏన్కూరు లింక్ కెనాల్(రాజీవ్ కెనాల్) కీలకం కానుంది. 18ఎల్ నంబర్‌తో నిర్మించే ఈ కెనాల్‌కు రూ.99.16 కోట్లు కేటాయించగా మే నెలలో పనులు ప్రారంభమయ్యాయి. తొమ్మిది కి.మీ. ఉండే ఈ కెనాల్ పనులు కేవలం నాలుగు నెలల్లోనే 8.60 కి.మీ. పూర్తికావడం విశేషం. భూసేకరణ సందర్భంగా రైతులకు పరిహారం అందక ముందే కాల్వ తవ్వకానికి అనుమతించారు. ఈ కెనాల్ ద్వారా జూలూరుపాడు, ఏన్కూరు మండలాల్లో 7,500 ఎకరాలు, వైరా ప్రాజెక్టు కింద 17 వేల ఎకరాలు, సాగర్ ప్రాజెక్టు ఆయకట్టు 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు వీలవుతుంది. ప్రధాన కాల్వ నిర్మాణానికి 5.300 కి.మీ. వద్ద అడ్డంకిగా ఉన్న హెచ్‌పీసీఎల్ గ్యాస్ పైపులైన్ అంశంపై గుజరాత్ రాష్ట్రంతో సంప్రదింపులు పూర్తయిన నేపథ్యాన మరో నెలలో కెనాల్ పూర్తిచేసేలా కాంట్రాక్టర్ పనుల్లో వేగం పెంచారు.

క్లుప్తంగా

19న పెద్దమ్మతల్లి ఆలయంలో చండీహోమం

పాల్వంచరూరల్: మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో ఈనెల 19న చండీహోమం పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. పూజలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని, వివరాలకు 63034 08458 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదు ఇస్తున్న ఆలయ ఉద్యోగి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి శనివారం నల్లగొండ జిల్లాకు చెందిన భక్తులు విరాళం అందించారు. మిర్యాలగూడెంనకు చెందిన కె.సత్యనారాయణ – సూర్యకుమారి రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేసి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ పర్యవేక్షకుడు లింగాల సాయిబాబు, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

13న స్మృతివనంలో వనమహోత్సవం

చండ్రుగొండ: దివంగత చండ్రుగొండ రేంజర్ చలమల శ్రీనివాసరావు జ్ఞాపకార్థం కనకగిరి అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన స్మృతివనంలో ఈ నెల 13న వనమహోత్సవం నిర్వహించనున్నట్లు రేంజర్ ఎల్లయ్య శనివారం తెలిపారు కార్యక్రమంలో ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన బీట్ ఆఫీసర్ల నుంచి సీసీఎఫ్ స్థాయి అధికారుల వరకు పాల్గొంటారని చెప్పారు.

అంతర్జాతీయ చెస్ రేటింగ్ సాధించిన రామ్



కోచ్ అన్వర్‌తో రామ్‌నచ్చికేత్

పాల్వంచ: ఇటీవల విజయవాడలో జరిగిన అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో పాల్వంచకు చెందిన విద్యార్థి ప్రతిభ చూపాడు. కేటీపీఎస్ సీ-కాలనీకి చెందిన స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షుడు చిలకబత్తిని వీరయ్య, ఏడీఈ ధనలక్ష్మి కుమారుడు చిలకబత్తిని రామ్ నచ్చికేత్ నవభారత్ పబ్లిక్ స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. ఇటీవల విజయవాడలో జరిగిన అంతర్జాతీయ ఫిడే చెస్ రేటింగ్‌లో 1,503 రేటింగ్ సాధించి సత్తాచాటాడు. గతంలో అండర్-11 విభాగంలో ఆరు ఇండియా చెస్ టోర్నమెంట్లు, మూడు అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్లు, అంతర్జాతీయ రాపిడ్ జస్ట్ టోర్నమెంట్ ఆడి ప్రతిభ చూపాడు. ఈ సందర్భంగా కోచ్ ఎండీ అన్వర్, ప్రిన్సిపాల్ ఎంపీ రెడ్డి తదితరులు అభినందించారు.

మేకలు కాసేందుకు వెళ్లిన యువతి అదృశ్యం

పాల్వంచరూరల్: మేకలు కాసేందుకు వెళ్లిన యువతి కనిపించకుండా పోయిన ఘటన ఉల్వనూరులో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఉల్వనూరుకు చెందిన పల్లపు నర్సింహారావు, ఎల్లమ్మల కుమార్తె శిరీష (19) శుక్రవారం మేకలు కాసేందుకు తల్లితోపాటు వెళ్లి కనిపించకుండా పోయింది. అడవి చుట్టుపక్కల గాలించినా ఆచూకీ దొరక్కపోవడంతో శనివారం యువతి తల్లి ఎల్లమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ సురేశ్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి, కేసు నమోదు చేశారు.


కొండచిలువ పట్టివేత



కొండ చిలువతో సంగయ్య, స్థానికులు

పాల్వంచ: ఇళ్లలోకి వచ్చిన పది అడుగుల కొండ చిలువను పట్టుకుని తిరిగి అడవిలో వదిలేశారు. పట్టణంలోని గుట్ట పక్కనే హమాలీకాలనీ ఇళ్ల మధ్యలోకి పది అడుగుల కొండ చిలువ శనివారం రాత్రి వచ్చింది. స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే పాములు పట్టే కేటీపీఎస్ ఆర్టిజన్ కార్మికుడైన పావురాల సంగయ్యకు సమాచారం అందించారు. ఆయన అక్కడికి చేరుకుని కొండ చిలువను పట్టుకుని, మైలారం అటవీ ప్రాంతంలో వదిలి పెట్టాడు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,828

చికిత్స పొందుతున్న కార్మికురాలు మృతి

- వెంటిలేటర్ లేకపోవడంతో జనరల్ వార్డులో చికిత్స
- తాగిన మందు తెలియక చికిత్సలో ఆలస్యం?
- కుటుంబానికి న్యాయం చేయాలంటూ వివిధ పార్టీల ఆందోళన
- కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రూ.3 లక్షల పరిహారానికి హామీ



ఓదమ్మ (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: దోమల నివారణకు వినియోగించే ద్రవం మలాథియాన్‌ను పొరపాటుగా తాగిన పారిశుద్ధ్య కార్మికురాలు ఓదమ్మ (59) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కొత్తగూడెం త్రీఇంక్‌లైన్‌కు చెందిన ఓదమ్మ రామవరం 8వ వార్డులో పారిశుద్ధ్య విభాగంలో కాంట్రాక్టు కార్మికురాలిగా పనిచేస్తోంది. శుక్రవారం దాహం వేయడంతో పక్కన ఉన్న మున్సిపల్ ట్రాలీవద్దకు వెళ్లి బాటిల్‌లో తాగునీరు అనుకుని మలాథియాన్ ద్రవం తాగింది. దీంతో సహచర సిబ్బంది కొత్తగూడెం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే, పురుగులమందు తాగిన వారికి వెంటిలేషన్ ఆధారంగా చికిత్స చేయాల్సి ఉన్నా వెంటిలేటర్లు పనిచేయక జనరల్ వార్డులో చికిత్స చేసినట్లు చెబుతున్నారు. అంతేకాక ఆమె తాగిన మందు పేరు చెప్పడానికి గంటకు పైగా సమయం పట్టడంతో చికిత్స ఆలస్యమైనట్లు తెలుస్తోంది. ఇలా కారణాలు ఏమైనా ఆమె మృతి చెందగా.. మున్సిపల్ అధికారులు, పాలకవర్గం శ్రద్ధ వహించి ఓదమ్మను ప్రైవేట్ ఆస్పత్రికి కానీ ఖమ్మం కానీ తరలించి ఉంటే బతికేదని పలువురు చెబుతున్నారు.

న్యాయం చేయాలని ఆందోళన

ఓదమ్మ కుటుంబానికి తగిన న్యాయం చేయాలని సీపీఎం, బీఎస్పీతో పాటు వివిధ సంఘాల నాయకులు ఆస్పత్రి మార్చురీ వద్ద ఆందోళన నిర్వహించారు. ఆమెకు ఐసీయూలో చికిత్స అందించి ఉంటే బతికేదని చెప్పారు. ఆమె కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో సీపీఐ, సీపీఎం నాయకుల మధ్య వాగ్వాదం జరగగా డీఎస్పీ రెహమాన్ నచ్చజెప్పారు. ఆ తర్వాత ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కమిషనర్ శేషాంజన్ స్వామి స్పందిస్తూ ఓదమ్మ కుటుంబంలో ఒకరి ఉద్యోగం, రూ.3 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇస్తామని ప్రకటించారు. అలాగే, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అదనపు సాయం అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపాలిటీపై ఉందని ఎమ్మెల్యే తెలిపారు. బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, ధర్మరాజు, బోయిన విజయ్‌కుమార్, పి.సత్యనారాయణచారి, జలాల్, భూక్యా రమేశ్, లిక్కి బాలరాజు, వీరన్న, రమేశ్, జి.నగేశ్, మునిగడప వెంకటేశ్వర్లు, యూసుఫ్, రత్నకుమారి, మాచర్ల శ్రీనివాస్, పిడుగు శ్రీనివాస్, షమీమ్ పాల్గొన్నారు.



మార్చురీ ఎదుట బైఠాయించిన నాయకులు



నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ సీతాలక్ష్మి, నాయకులు

భర్తను అప్పగించాలని యువతి వినతి

ఖమ్మంమామిళ్లగూడెం: పెద్దల సాక్షిగా పెళ్లిచేసుకుని.. ఆరు నెలలకే అదనపు కట్నం కోసం వేధిస్తూ వెళ్లిపోయిన భర్తను తనకు అప్పగించి న్యాయం చేయాలని కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం అన్నారం గ్రామానికి చెందిన పూదరి స్వప్న కోరింది. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆమె మాట్లాడుతూ.. భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండలం జడలచింతలకు చెందిన కల్లెం నర్సింహారావు కుమారుడు సునీల్‌తో కులపెద్దల సమక్షాన ఖమ్మం ఐఎంఏ హాల్‌లో తనకు వివాహం జరిగిందని వెల్లడించింది. ఆ తర్వాత అదనపు కట్నం కోసం వేధిస్తూ వెళ్లిపోగా.. ఖమ్మంలో ఉంటున్న సునీల్ తనను దూరం పెడుతున్నాడని వాపోయింది. ఈ మేరకు అధికారులు స్పందించి తన భర్తను అప్పగించాలని కోరింది. సమావేశంలో స్వప్న కుటుంబీకులు రమ, రాము, రేవతి, వీరబాబు, గోపి పాల్గొన్నారు.

దాడి చేశారని ఫిర్యాదు

ములకలపల్లి: పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమిలో ట్రాక్టర్‌తో దున్నుతుండగా ఆ భూమి తమదంటూ దాడి చేశారని బాధితురాలు ముక్కెర స్వప్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం మేరకు.. ములకలపల్లికి చెందిన స్వప్న, కుటుంబీకులు స్థానిక జీసీసీ పెట్రోల్ బంక్ సమీపంలో పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమిలో 60 ఏళ్లుగా సేద్యం చేస్తున్నారు. కొంతకాలంగా ముక్కెర పూర్ణచందర్‌రావు ఈ భూమి విషయమై గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం భూమి దున్నుతుండగా పూర్ణచందర్‌రావుతోపాటు మరికొందరు వచ్చి దాడికి పాల్పడ్డారు. తక్షణమే పొలం వదిలి వెళ్లిపోవాలని దుర్భాషలాడారు. న్యాయం చేయాలని కోరుతూ బాధితురాలు శనివారం పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

సింగరేణి(కొత్తగూడెం): వివిధ ఏరియాల్లోని భూగర్భ, ఓపెన్ కాస్ట్‌లలో ఖాళీగా ఉన్న చార్జ్‌హ్యాండ్, ఫోర్‌మెన్ ఇన్‌చార్జ్ (ఎలక్ట్రికల్) ఖాళీలకు కంపెనీలో పనిచేస్తున్న నాన్ డిప్లొమా వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. వీరిని వెబ్ కౌన్సెలింగ్ ద్వారా సీనియారిటీ బేస్‌తో ఖాళీలను బట్టి ఎంపిక చేస్తామని, ఈ సర్క్యులర్‌కు ముందుగా దరఖాస్తు చేసుకున్న వారు అర్హులని, రాత పూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

రామకృష్ణాపురం వాసికి డాక్టరేట్



నిరంజన్‌రావు

కామేపల్లి: కామేపల్లి మండలం రామకృష్ణాపురానికి చెందిన దీవెల నిరంజన్‌రావుకు డాక్టరేట్ లభించింది. వాతావరణ మార్పు, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం తదితర అంశాలపై ఆయన సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఢిల్లీ ఐఐటీ డాక్టరేట్ ప్రకటించింది. ఇటీవల జరిగిన స్నాతకోత్సవంలో నిరంజన్‌రావు డాక్టరేట్ అందుకున్నారు.

గంజాయి పట్టివేత

భద్రాచలంఅర్బన్: ద్విచక్రవాహనాలపై తరలిస్తున్న గంజాయిని స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఎక్సైజ్ సీఐ రహీమున్నీసా వివరాలు వెల్లడించారు. బ్రిడ్జి సెంటర్‌లో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు.. అటుగా వచ్చిన మూడు ద్విచక్రవాహనాలను ఆపి తనిఖీ చేశారు. గంజాయి దొరకడంతో ద్విచక్రవాహనాలతో సహా గంజాయిని ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. గంజాయిని చింతూరు నుంచి హైదరాబాద్‌కు తరలిస్తూ పట్టుబడిన తేలిందని సీఐ తెలిపారు. 24.7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురు నిందితులతో పాటు పరారీలో ఉన్న మరో నిందితుడిని హైదరాబాద్‌లో అరెస్టు చేశామని సీఐ రహీమున్నీసా వెల్లడించారు. ఎక్సైజ్ ఎస్‌ఐ సీతారామరాజు, హెడ్‌కానిస్టేబుల్ ఎస్‌డీ ఆలీమ్, కానిస్టేబుళ్లు వీరబాబు, కోటబాబు, నాగేశ్వరరావు, లలిత, మనోహర్, సుజాత్ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌లో తరలిస్తున్న గంజాయి సైతం..

చింతూరు నుంచి భద్రాచలం మీదుగా ట్రాక్టర్‌లో తరలిస్తున్న గంజాయిని భద్రాచలం ఎక్సైజ్ సీఐ రహీమున్నీసా, సిబ్బంది పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను ఆపకుండా పోలీసుల వాహనాన్ని ఢీకొట్టి తప్పించుకోవాలని చూడగా బ్రిడ్జి సెంటర్ వద్ద స్థానికులు తమ వాహనాలను అడ్డుగా పెట్టారు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ పారిపోగా సీఐ అక్కడికి చేరుకుని పరిశీలించారు. ట్రాక్టర్ ట్రక్కు కింది భాగంలో సుమారు 40 ప్యాకెట్ల గంజాయి లభించగా.. పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.




ట్రాక్టర్‌లో తరలిస్తున్న గంజాయిని పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

40 కిలోల గంజాయి పట్టివేత

ఇల్లెందురూరల్: మండలంలోని సుదిమళ్ల గ్రామ పంచాయతీ జగదాంబగుంపు సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 40 కిలోల గంజాయిని శనివారం రాత్రి ఇల్లెందు పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఒడిశా రాష్ట్రం నుంచి హైదరాబాద్ వైపు కారులో గంజాయి తరలిస్తుండగా వాహన తనిఖీల్లో పోలీసులు గుర్తించి గంజాయిని, తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ సత్యనారాయణను వివరణ కోరగా గంజాయి అక్రమ తరలింపుపై విచారణ చేస్తున్నామని పూర్తి వివరాలు ఆదివారం వెల్లడిస్తామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి...



దీపక్ మృతదేహం

దుమ్ముగూడెం: మండలంలోని కొత్తపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి కుంజా దీపక్ (13) ఎటపాక మండల తునికిచెరువు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటన శనివారం చోటుచేసుకుంది. కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలలో బండారుగూడెంనకు చెందిన కుంజా దీపక్, కాటేబోయిన జశ్వంత్, కుంజా అనిల్, కాటేబోయిన కార్తీక్ చదువుతున్నారు. శనివారం, ఆదివారం సెలవులు రావడంతో హాస్టల్ సిబ్బందికి చెప్పకుండా బయటకు వచ్చారు. కానీ, వారితో పాటు బయటకు వచ్చిన తాటి అనిల్ ఆటో ఎక్కకుండా తిరిగి హాస్టల్‌కి వెళ్లాడు. మిగిలిన ముగ్గురు ఆటో ఎక్కి స్వగ్రామానికి బయలుదేరగా తునికిచెరువు సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఆటోను ఢీకొట్టింది. దీంతో గాయపడిన వారిని భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించగా దీపక్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఎటపాక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఆటో ప్రమాదం సమయంలో దీపక్ అపస్మారక స్థితిలోకి వెళ్లగా తోటి స్నేహితుడు సీపీఆర్ చేసి బతికించేందుకు యత్నించినా ఫలితం లేకపోయిందని తెలిసింది.

చికిత్స పొందుతున్న విద్యార్థి..



సాయికుమార్ (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని పోచారంతండా గ్రామపంచాయతీ అమర్‌సింగ్ తండాకు చెందిన గుగులోత్ సాయికుమార్ (15) ఈ నెల 6న గడ్డి మందు తాగగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పట్టణంలో నివాసం ఉంటూ స్థానిక ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న సాయికుమార్ ఈ నెల 5వ తేదీన ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు టీవీ చూస్తుండగా తండ్రి మందలించాడన్న కోపంతో పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు ఇల్లెందు ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. శనివారం సాయికుమార్ మృతిచెందగా మృతుడి తండ్రి చిన్న ఫిర్యాదు మేరకు కొమరారం ఎస్‌ఐ సోమేశ్వర్ కేసు నమోదు చేశారు.

గాయపడిన వ్యక్తి...

పాల్వంచ: మోటార్ సైకిల్ పైనుంచి కింద పడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మున్సిపాలిటీ పరిధిలోని చిన్నబంగారు జాల గ్రామానికి చెందిన కోరం సుజన్ (34) కేటీపీఎస్‌లో రోజు వారి కూలీగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే జూలై 25వ తేదీన తన బైక్‌పై పనికి వెళ్లాడు. రాత్రి కూడా ఇంటికి రాలేదు. 26వ తేదీ తెల్లవారుజామున 3 గంటల సమయంలో భార్య రాధకు ఓ వ్యక్తి ఫోన్ చేసి కుంటినాగులగూడెం సమీపంలో మోటార్ సైకిల్ పైనుంచి సుజన్ కింద పడి తీవ్రంగా గాయపడ్డాడని సమాచారం అందించారు. అనంతరం అతడిని అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య రాధ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడిపై పోక్సో కేసు

అశ్వారావుపేటరూరల్: బాలికను ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తున్న బాలుడిపై శనివారం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన పదిహేనేళ్ల బాలికను, 18 ఏళ్ల బాలుడు కొంతకాలంగా ప్రేమిస్తున్నానని వెంట పడటంతో పాటు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సైబర్ మోసానికి గురైన మహిళ

పాల్వంచ: పట్టణంలో ఓ మహిళ సైబర్ మోసానికి గురికాగా.. శనివారం వెలుగులోకి వచ్చింది. జయమ్మకాలనీకి చెందిన ఓ మహిళకు ఈ నెల 9వ తేదీన ఓ వ్యక్తి ఫోన్ చేసి ఇంటి వద్దే ఉండి డబ్బు సంపాదించుకోవచ్చని నమ్మబలికాడు. తమ నంబర్‌కు రూ.9,500 నగదు పంపిస్తే రూ.25 వేల వరకు వస్తాయని చెప్పారు. దీంతో ఆమె నమ్మి ఫోన్ పే చేసింది. ఆ అమౌంట్‌కి సపోర్టింగ్ పర్సన్ కోసం మరో రూ.9,500 పంపించాలని చెప్పగా మళ్లీ నమ్మి పంపించారు. అప్పటి నుంచి ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదు. దీంతో మోసపోయినట్లు గుర్తించి, శనివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

పినపాక: ద్విచక్రవాహనంపై నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని శనివారం ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ రాజిరెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని దుగినేపల్లికి చెందిన అజ్మీర లక్ష్మయ్య ఐదు లీటర్ల నాటుసారాను ద్విచక్ర వాహనంపై తరలిస్తూ.. అక్కడే చేపట్టిన వాహన తనిఖీల్లో దొరికాడు. ద్విచక్ర వాహనం, నాటుసారాను స్వాధీనం చేసుకుని లక్ష్మయ్యపై కేసు నమోదు చేశామని సీఐ రాజిరెడ్డి వివరించారు. తనిఖీల్లో ప్రసన్నకుమార్, ధనజ్యోతి, అమల పాల్గొన్నారు.

బెదిరించిన కేసులో నలుగురి రిమాండ్

ఖమ్మంఅర్బన్: ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల పేరుతో హోటళ్ల యజమానులను డబ్బుల కోసం బెదిరించిన నలుగురిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు. భద్రాద్రి జిల్లాకు చెందిన గుగులోతు మోహన్‌రావు, బానోతు రామస్వామి, సపావత్ యువరాజ్, అజ్మీరా యువరాజుసింగ్ శుక్రవారం ఖమ్మంలోని ఓ హోటల్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల పేరిట తనిఖీలు చేసి యజమానిని డబ్బులు డిమాండ్ చేశారు. యజమాని ఫిర్యాదుతో వీరి నుంచి ఒక కారు, రూ.30 వేల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 8వ తేదీన కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట 50 నుంచి 55 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి చనిపోయాడు. ఆస్పత్రి డ్యూటి డాక్టర్ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ పురుషోత్తం కేసు నమోదు చేసి మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. ఎవరైనా గుర్తు పడితే 87126 82027, 87126 82026 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గాయపడిన వృద్ధురాలు..

చండ్రుగొండ: వంటగ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగి గాయాలపాలైన వెంకటనర్సమ్మ (60) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మండలంలోని మద్దుకూరులో ఈ నెల 2న గ్యాస్‌లీకై చెలరేగిన మంటల్లో గాయపడిన బూర్గు వెంకటనర్సమ్మ ఆమె భర్త నర్సింహులును కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన విషయం విదితమే. చికిత్స పొందుతూ వెంకటనర్సమ్మ మృతిచెందగా నర్సింహులు ఆరోగ్యం నిలకడగా ఉండటంతో వైద్యులు డిశ్చార్జ్ చేశారు. మృతురాలికి భర్తతోపాటు ఇద్దరు కుమారులున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.